RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే
దిన పత్రిక

**మంచిమాట**

నీకున్నదంతా ఏదో ఒకరోజున ఇచ్చేయాల్సిందే. నీవెంట ఏదీ తీసుకెళ్ళలేవు. అంచేత ఆ ఇచ్చేదేదో ఇప్పుడే ఇవ్వు. ఇచ్చే గొప్ప అవకాశాన్ని నువ్వే వాడుకో. ఇవ్వడంలోని ఆనందాన్ని అనుభవించాల్సింది నువ్వేకానీ నీ వారసులు కాదు. Ss

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 198
శుక్రవారం, జూలై 03, 2026 , పేజీలు - 4 వెల : 2/-

## కేబినెట్ భేటీలో సంచలన నిర్ణయాలు..
# ఆ పథకానికి ఆమోదం



హైదరాబాద్ :తెలంగాణ కేబినెట్ భేటీ తాజాగా పూర్తయింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిల్లో రాష్ట్రంలో వీబీ జీ రామ్ జీ పథకం అమలు, మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్, ప్రభుత్వ ఉపాధ్యా యులకు అల్పా హారం తదితర అంశాలు ఉ న్నాయి. కేబినెట్ సమావేశం అనంతరం ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రి పొం గులేటి శ్రీనివాస రెడ్డి మీడియాకు వెల్లడిం చారు.తెలంగాణలో వీబీ జీ రామ్ పథకం అమలు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. ఈ మేరకు అభ్యంతరాలపై సుప్రీంకోర్టును ఆశ్రయి ంచాలని నిర్ణయించింది. అలాగే మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ అంశం పైనా కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. మూసీ ప్రాజెక్ట్ మొదటి దశకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు రూ. 7,345 కోట్లతో మూసీ సుందరీకరణ పనులు జరగనున్నాయి. ఈ క్రమంలో టెండర్లు పిలిచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి గుడ్ న్యూస్ చెప్పింది రాష్ట్ర ప్రభుత్వం. ఇకపై వారికి కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే విద్యా ర్థులకు ఈ పథకం అమల్లోకి ఉండగా తాజాగా ఉపాధ్యా యులకూ వర్తింపజేస్తూ కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇక దీనికి సంబంధించి విధి విధానాలు, ఇతర అంశాలు అధికా రికంగా ప్రభుత్వం త్వరలో విడుదల చేసే అవకాశం ఉందిఅలాగే టిమ్స్, వరంగల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో దాదాపు 6 వేలకు పైగా పోస్టులు మంజూరు చేసింది. ఇక గోదాములు, విద్యాలయాలు, సంస్థల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది రాష్ట్ర కేబినెట్.

## కేబినెట్ భేటీకి మంత్రి
# కొండా సురేఖ డుమ్మా..
**- యాదగిరిగుట్ట బోర్డు వివాదమే కారణమా!**



హైదరాబాద్ :తెలంగాణ కేబినెట్ భేటీకి మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం తీవ్ర చర్చనీ యాంశంగా మారింది. ఇటీవల విదేశీ పర్యటన పూర్తి చేసుకుని తిరిగి వచ్చినా ఆమె మంత్రివర్గ సమా వేశానికి రాకపో వడంపై రకరకాల అనుమానాలకు తావి స్తోంది. తనను సంప్రదించకుండానే.. యాదగిరిగుట్ట బోర్డు సభ్యుల ఎంపిక ప్రక్రియ జరిగిందని.. అందుకే ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇదే విషయంపై అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు ఏర్పాటు ప్రక్రియ.. తెలంగాణ ప్రభుత్వంలో భారీ అలజడి సృష్టిస్తోంది. తమను పట్టించుకోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన ఇష్టం ఉన్న వారిని బోర్డు సభ్యులుగా ఎంపిక చేశారని పలువురు కాంగ్రెస్ నేతల్లో రగులుతోంది. సీనియర్ నేతలను సంప్రదించకుండా, వారికి కనీసం సమాచారం ఇవ్వకుండా యాదగిరిగుట్ట ఆలయ బోర్డును ఏర్పాటు చేశారంటూ.. హస్తం నేతలు గుసగుసలు పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే తన అసంతృప్తిని వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# ‘ఆమె నా అందమైన చెల్లెలు’..
## జపాన్ ప్రధానిని మెచ్చుకున్న ప్రధాని మోదీ



జపాన్: భారత పర్యటన (వచ్చిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచి ని ప్రధాని నరేంద్ర మోదీ సాదరంగా ఆహ్వానించారు. గురువారం ఇరువురు నేతలూ సంయుక్త మీడియా సమావేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను తన అందమైన చెల్లెలుగా మోదీ అభివర్ణిం చారు. భారతదేశ వృద్ధి ప్రయాణంలో జపాన్ పాత్ర కీలకమని కొనియాడారు. ఆత్మీయంగా మోదీ పిలిచిన పిలుపుపై తకాయిచి సంతోషం వ్యక్తంచేశారు.

# చర్చలకు పిలిచి తోక ముడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం
**: మాజీ మంత్రి హరీష్ రావు**



హైదరాబాద్ : బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులపై చర్చకు రమ్మని పిలిచిన ప్రభుత్వం, మంత్రులు తోక ముడిచి పారిపోయారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును వివరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాను, నాయకులు, చర్చలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీసులతో అడ్డుకున్నారని దుయ్యబట్టారు. చర్చల నుంచి తప్పించుకోవడంలో ఆంతర్యమేముందని ప్రశ్నిం చారు .బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పు చేసిందని ఒకరోజు , మరో రోజు రూ.7 లక్షల కోట్లని మాటమార్చి చర్చలకు రాకుండా మంత్రి జూపల్లి తోక ముడిచారని విమరి ్శంచారు. గతంలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో తాను పాల్గొని బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పుల గురించి డిటేల్డ్‌గా మాట్లాడి ప్రభుత్వం నోరును మూయించానని వెల్లడించారు. నాటి సమావేశంలో తాను చేసిన సవాలుకు సమాధానం ఇవ్వకుండా అసెంబ్లీని వాయిదా వేశారని గుర్తు చేశారు.ఇప్పటికైనా బీఆర్ఎస్ చేసిన అప్పుల విషయంలో గాని, కాంగ్రెస్ మంత్రులు చేస్తున్న అవినీతి, అక్రమాలపై అసెంబ్లీ సమావేశంలో గాని, ఇంకెక్కడైనా సరే చర్చ పెడితే సమాదానం ఇవ్వడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌కు వస్తానన్న మంత్రి కోసం చర్చల్లో పాల్గొనేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్ని ఏర్పాటు చేయగా తెలంగాణ అమరవీరుల వద్దకు రమ్మని మంత్రి జూపల్లి కోరితే అక్కడికి వెళ్లేందుకు సిద్ధమైన కేటీఆర్‌ను పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు.ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలకు చెందిన సుమారు రూ.2 వేల కోట్ల టెండర్ల విషయంలో అవినీతి, అక్రమాలు జరిగాయని వీటిపై కూడా చర్చల నుంచి ప్రభుత్వం పారిపోయిందని విమర్శించారు. చర్చలకు రమ్మన్న ముగ్గురు మంత్రులకు ఫోన్లు చేస్తే ఫోన్లు ఎత్తలేదని, వారి వద్దకు వెళ్లడానికి అనుమతి కావాలని కోరిన తమను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. చర్చలు జరిగితే కాంగ్రెస్ బండారం అంతా బయటపడుతుందని భయంతో, చర్చలు జరగకుండా అరెస్ట్ చేశారని హరీశ్‌రావు ఆరోపించారు.

## కేవలం పేదల ఇళ్లు మాత్రమే కూల్చుతున్నారు..
# హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం




హైదరాబాద్ :హైడ్రాపై మరోసారి హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేవలం పేదల ఇళ్లను మాత్రమే కూల్చుతున్నారని మండిపడింది. తార్నాక ఎర్రకుంట ఆక్రమణకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. హైడ్రా, జీహెచ్ఎంసీలపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆక్రమణకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదని పిటిషనర్ చేసిన వాదనలపై స్పం దించిన హైకోర్టు.. ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ పిటిషన్‌పై తదు పరి విచారణను వాయిదా వేసింది.హైదరాబాద్ నగరంలో చెరు వులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను గుర్తించి.. అక్క డ ఏర్పాటు చేసిన నిర్మాణాలను తొలగిస్తున్న హైడ్రా పై ఎన్ని ప్రశంసలు వస్తున్నాయో.. అంతకంటే ఎక్కువగా విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. హైడ్రా ప్రతాపం కేవలం పేదలపైనే అని.. బడా వ్యాపారులు, రాజకీయ నేతలు, పలుకుబడి ఉన్న వ్యక్తులను చూసీచూడనట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు ఇప్పటికే వ్యక్తం అవుతున్నాయి. అదే సమయంలో కొన్ని చోట్ల హైడ్రా అధికారుల దూకుడుపై తెలంగాణ హైకోర్టును కొందరు బాధితులు ఆశ్రయించగా.. అలాంటి పిటిషన్లపై విచారణ జరిపి.. హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసి ందే. తాజాగా అలాంటి సంఘటనే చోటు చేసుకుంది.హైదరాబాద్ తార్నాకలోని ఎర్రకుంట అక్రమాలపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. హైడ్రా తీరుపై మరోసారి అసహనం వ్యక్తం చేసింది. ఎర్రకుంట ఆక్రమణలపై దాఖలైన పిటిషన్‌పై వాదనల సందర్భంగా.. 8 ఎకరాల ఎర్రకుంట చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుని ఆక్రమణకు గురైందని పిటిషనర్ తరఫు లాయర్ విజయ్ గోపాల్..తెలిపారు.

# టీఎంసీలో చీలిక..
# ఇరు పక్షాలకు ఈసీ నోటీసులు




కోల్‌కతా: మాజీ సీఎం మమతా బెనర్జీపై రితబ్రత బెనర్జీ తిరుగుబాటు బావుటా ఎగరేసిన నేపథ్యంలో ఈసీ ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేసింది. తామే అసలైన టీఎంసీ అని ఇరు వర్గాలు చెబుతున్న నేపథ్యంలో వారి వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చింది.టీఎంసీ నేత రితబ్రత బెనర్జీ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం స్పందించింది. ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఎన్నికల గుర్తుతో పాటు టీఎంసీ నాయకత్వం తమదే అంటూ ఇరు వర్గాలు ప్రకటించుకున్న నేపథ్యంలో ఈసీ గురువారం ఈ నోటీసులు జారీ చేసింది. పార్టీ గుర్తు, బ్యాంక్ అకౌంట్లు, పార్టీ కార్యవర్గం, ఇతర వ్యవస్థల విషయంలో జులై 6 లోపు పూర్తిస్థాయి వివరాలు ఇవ్వాలని కోరింది.ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి తరువాత రితబ్రత సారథ్యంలో ఒక వర్గం తిరుగుబాటు బావుటా ఎగరవేసిన విషయం తెలిసిందే. మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నాయత్వాన్ని అంగీకరించేది లేదని రితబ్రత తేల్చి చెప్పారు. అంతేకాకుండా, పార్టీకి ఉన్న 80 మంది ఎమ్మెల్యేల్లో అన్నారు.

# చర్చలు సానుకూలంగా సాగుతున్నాయి..
## దోహా సమావేశాలపై ఖతార్ ఆశాభావం..



అమెరికా: ఇరాన్ మధ్య అణు కార్యక్రమానికి సంబంధించిన దౌత్య చర్చలు సానుకూలంగా సాగుతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఖతార్ రాజధాని దోహాలో ఇరు దేశాల ప్రతినిధుల మధ్య జరిగిన పరోక్ష చర్చలు ఫలవంతంగా సాగినట్లు ఖతార్ వెల్లడించింది. ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందంలోని అం శాల అమలుపై పురోగతి కనిపించిందని, తదుపరి విడత చర్చలు కూడా కొనసా గనున్నాయని తెలిపింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ చర్చలపై ఆశావహ వ్యాఖ్యలు చేశారు. అమెరికా, ఇరాన్ ప్రస్తుతం చాలా మంచి అవగాహనతో ముందుకు వెళ్తున్నాయని, అణు కార్యక్రమంపై ఒప్పందానికి చేరుకునే అవకాశాలు బలంగా ఉన్నాయని చెప్పారు. ఇరు దేశాల మధ్య విభేదాలు తగ్గుతున్నాయని, హోర్ముజ్ జలసంధిలో నౌకాయాన భద్రత, కాల్పుల విరమణ కొనసాగింపు వంటి అంశాలపైనా పేర్కొన్నారు.

# పలుగు పట్టి.. పారెత్తి..
# కరువు పనిలో దిగిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్!



అమరావతి: దేశ గ్రామీణ అభివృద్ధి చరిత్రలో ఆంధ్రప్రదేశ్ వేదికగా ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, జీవనోపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేసిన “వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్”దేశవ్యాప్తంగా నేటి నుంచి అధికారికంగా ప్రారంభమైంది.తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం ముక్కావారిపల్లి గ్రామంలో గురువారం నాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ కలిసి ఈ మెగా మిషన్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, పలుగు పట్టి.. పారెత్తి.. కరువు పనిలో పాల్గొని ఉపాధి కూలీల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.సభా ప్రాంగణానికి చేరుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మొదటగా సమీపంలో మొక్కలు నాటి పర్యావరణ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వలను పెంచేందుకు ఉద్దేశించిన ‘మ్యాజిక్ డ్రైన్ల’ పనితీరును వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి సంరక్షణకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫొటో గ్యాలరీని వారు సందర్శించారు. గ్రామీణ స్వచ్ఛతను పెంపొందించేందుకు సిద్ధం చేసిన ‘స్వచ్ఛ రథాలను’ సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి, డిప్యూటీ సీఎంలు నిశితంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

# అమీన్‌పూర్‌లో భారీగా పట్టుబడిన గంజాయి : 17 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

**- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన సిఐ నరేష్**





**అమీన్‌పూర్, జూలై 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సైబరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై తమ శాఖ చేపట్టిన విజయవంతమైన ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. అమీన్‌పూర్ పోలీసులు మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం నిఘా ఉంచుతున్నామని, దీనిలో భాగంగానే ఈరోజు ఉదయం ఒడిశా నుండి మహారాష్ట్రకు తరలిస్తున్న భారీ గంజాయి నిల్వలను పట్టుకోగలిగామని సిఐ నరేష్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఔటర్ రింగ్ రోడ్డు (ఓ ఆర్ ఆర్) సుల్తాన్‌పూర్ ఎగ్జిట్-4 వద్ద పోలీసులు జరిపిన తనిఖీల్లో, చేపల బాక్సుల మాటున దాచిన 34.50 కేజీల గంజాయిని గుర్తించామన్నారు. దీని విలువ సుమారు రూ. 17 లక్షలు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

**ఆపరేషన్ వివరాలు:**
ఈ రోజు (02.07.2026) ఉదయం ఒడిశాలోని మల్కన్‌గిరి నుండి మహారాష్ట్రలోని సోలాపూర్‌కు 'మహీంద్రా బొలెరో పికప్ వాహనం' (నెంబర్: ఓ డి 30 ఎ 7774)లో గంజాయిని తరలిస్తున్న క్రమంలో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.
నిందితుల వివరాలు:
సుమిత్ బిసారి (వయస్సు 25) - ఒడిశా.
బాబుల్ మండల్ (వయస్సు 29) - ఒడిశా.
ప్రధాన నిందితుడు సుఖ్‌దేవ్ (ఒడిశా) పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు ముమ్మరం చేశామని సిఐ వెల్లడించారు.

**స్వాధీనం చేసుకున్నవి:**
34.50 కేజీల ఎండు గంజాయి. మహీంద్రా బొలెరో పికప్ వాహనం (ఓ.డి 30 ఎ 7774). 2 మొబైల్ ఫోన్లు. ఈ కేసులో మాదకద్రవ్యాల నిరోధక చట్టం (ఎన్ డి పి ఎస్) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సుందర్ రెడ్డి (ఇన్‌స్పెక్టర్, ప్రత్యేక ఆపరేషన్ టీమ్ - ఎస్ ఓ టి), కె. రాజేష్ (సబ్ ఇన్‌స్పెక్టర్, ప్రత్యేక ఆపరేషన్ టీమ్ - ఎస్ ఓ టి), టి. విజయ్ రావు (సబ్ ఇన్‌స్పెక్టర్, అమీన్‌పూర్) మరియు పోలీసు సిబ్బంది సమర్థవంతంగా పనిచేశారని, వారిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అభినందించారని సిఐ నరేష్ తెలిపారు.

# కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి అండగా కాటా శ్రీనివాస్ గౌడ్

**- కూతురి వివాహానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేత**



**జన్నారం, జులై 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
కాంగ్రెస్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడంలో పార్టీ ఎప్పుడూ ముందుంటుందని పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా, జన్నారం మున్సిపాలిటీ పరిధిలోని ఉట్ల గ్రామానికి చెందిన, కాంగ్రెస్ పార్టీ వీరవిధేయుడు, దివంగత అన్నారం సాయిలు కుమార్తె వివాహం సందర్భంగా, సాయిలు కుటుంబ సభ్యులకు కాటా శ్రీనివాస్ గౌడ్ లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన సాయిలు సేవలను పార్టీ ఎన్నటికీ మరువదని, ఆయన కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమమే తమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ గంగు రమేష్, గుమ్మడిదల కౌన్సిలర్ నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శివరాజ్, మాజీ ఉప సర్పంచ్ రవి, నాయకులు యనగండ్ల నరేందర్, జింకల మధు తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరు రైల్వే భూముల్లో నివసిస్తున్న పేదలకు అండగా ఉంటా: ఎంపీ రఘునందన్‌రావు

**- బండ్లగూడలో రైల్వే స్టేషన్, ఈఎస్ఐ క్లినిక్ స్థలాలను పరిశీలించిన ఎంపీ**







**పటాన్‌చెరు, జూలై 2: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** పటాన్‌చెరు నియోజకవర్గం, జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో ఉన్న రైల్వే భూములు, రైల్వే స్టేషన్ మరియు పాత ఈఎస్ఐ క్లినిక్ స్థలాలను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు గు రువారం ఉదయం క్షేత్రస్థాయిలో సందర్శించారు. రైల్వే స్థలంలో నివసిస్తున్న పేద ప్రజల విజ్ఞప్తి మేరకు ఆయన ఈ పర్యటన చేపట్టారు.

**ప్రజలతో కలిసి పాదయాత్ర..**
బండ్లగూడలోని దోసన్ చెరువు వద్ద నుంచి పటాన్‌చెరు రైల్వే స్టేషన్ వరకు ఎంపీ రఘునందన్‌రావు కాలినడకన పర్యటించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు వరకు ఉన్న రైల్వే సదు పాయం నిలిచిపోయి, ట్రాక్ తొలగించిన నేపథ్యంలోనే పేదలు ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. రైల్వే భూమిలో ఆక్రమణలు చేయడం చట్టరీత్యా తప్పైనప్పటికీ, పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి న్యాయం చేసే దిశగా రైల్వే అధికారులతో చర్చిస్తానని, త్వరలోనే అధికారులతో మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

**రైల్వే స్టేషన్ ఆక్రమణపై ఆగ్రహం..**
పర్యటనలో భాగంగా పటాన్‌చెరు రైల్వే స్టేషన్‌ను సందర్శించిన ఎంపీకి షాకింగ్ దృశ్యం కనిపించింది. స్టేషన్ పరిధిలో ఒక ప్రైవేట్ వ్యక్తి రైల్వే ప్రహరీ గోడకు గేటు వేసి, బోరు వేసి భూమిని కబ్జా చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రైల్వే అధికారులకు ఫోన్ చేసి క్షేత్రస్థాయిలో క్లాస్ పీకారు. పేదలకు నోటీసులు ఇస్తూనే, ప్రభుత్వ ఆస్తిని కబ్జా చేస్తున్న వారిని ఎలా ఉపేక్షిస్తున్నారని అధికారులను నిలదీశారు. స్టేషన్‌ను కబ్జా చేసిన సదరు వ్యక్తిపై వెంటనే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

**కార్మికులకు ఈఎస్ఐ క్లినిక్ అందుబాటులోకి..**
అనంతరం పాత ఈఎస్ఐ క్లినిక్ స్థలాన్ని ఎంపీ రఘునందన్‌రావు పరిశీలించారు. ఈ స్థలాన్ని త్వరలోనే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, కార్మికులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. త్వరలోనే కార్మిక శాఖ అధికారులతో కలిసి వచ్చి, క్లినిక్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి

**- మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదు కలెక్టర్ ప్రతి మాసింగ్**



**మెదక్,జులై,2,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**
యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదు,జిల్లాలో యూరియా సరఫరా పై కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్ మరియు మార్క్ ఫెడ్ లో 3617 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ కలదన్నారు. ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నాం అని వివరించారు. రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటి వరకు 53,297 రైతులు 5706 మెట్రిక్ టన్నుల యూరియా కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు.

# పెండింగ్ కేసుల పరిష్కారం వేగవంతం చేయాలి

**- డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలి**
**- నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్**



**మెదక్,జులై,2,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**
ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు,సిబ్బంది విధి నిర్వహణ, స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, వాటి పరిష్కార ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సృజనకు సూచించారు. కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా సమయపాలనతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షిస్తూ ట్రాఫిక్ నియంత్రణతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ, ప్రధాన కూడళ్లు, వ్యాపార ప్రాంతాలు, ఇతర కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శక పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ తనిఖీలో రామాయంపేట్ సీఐ సైదా, ఎస్ఐ సృజనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా చరిత్రలో రికార్డు స్థాయి ధాన్యం కొనుగోలు

**జిల్లాలో జొన్నలు కొనుగోలు చేస్తాం**
**- ధాన్యం కొనుగోళ్లలో మీడియా పాత్ర అమోఘం,మీడియా సూచనలు, సలహాలు పాటించాం.**
**- ఈ ఏడాది యాసంగిలో గతంలో కంటే లక్ష మెట్రిక్ టన్నులు అత్యధికంగా రైతులు దిగుబడులు**
**-జిల్లాలో4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ**
**-రైతులఅకౌంట్లలోరూ 1005.66 కోట్ల రూపాయలు జమ**
**-101,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ**
**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్,జులై,2,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**
జిల్లాలో సంపూర్ణంగా వరి ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలు విజయవంతం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ,మెదక్ జిల్లా చరిత్రలో జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సంపూర్ణంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు. ఈ ఏడాది యాసంగిలో గతంలో కంటే 1.08 లక్ష మెట్రిక్ టన్నులు అత్యధికంగా రైతులు దిగుబడులు పండించారని,జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ పూర్తి అయిందన్నారు. రైతుల అకౌంట్లలో రూ. 1005.66 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. 1,01,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ చేసి ఏప్రిల్ 08 న ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు జూన్ 27వ తేదికి పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 533 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ -305, ఐకేపీ-185, డీసీఎంఎస్- 43 కేంద్రాల్లో కొనుగోలు జరిపామన్నారు. జొన్నలు కొనుగోలు చేస్తాం,జిల్లాలో జొన్న రైతులు ఎలాంటి ఆందోళన గురి కావద్దని, జొన్నల కొనుగోళ్ల గురించి సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. శుభ్రంగా ఉన్న జొన్నల్ని కొరడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 3609 ముందు రైతుల నుండి 6347 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా సివిల్ సప్లై అధికారి పి.నిత్యానందశీ, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్ ,జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ బిల్డదాన్ -2025 రాష్ట్రస్థాయి కాంపిటీషన్ లో తూప్రాన్

- గీతా స్కూల్ విద్యార్థుల ప్రతిభ
- మహతి, కృత్తిక, రాజేష్ ఆశీష్ లు సంయుక్తంగా రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక
- కలెక్టరేట్ కార్యాలయంలో విద్యార్థులను అభినందించిన అదనపు కలెక్టర్ నగేష్




**మెదక్,జులై,2,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)** వికసిత్ భారత్ బిల్డదాన్ -2025 రాష్ట్రస్థాయి కాంపిటీషన్ లో ఆన్లైన్ లో నిర్వహించగా తెలంగాణ రాష్ట్రం నుండి మూడు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక చేయగా అందులో ఒక ప్రాజెక్టు మన జిల్లా లోని గీతా స్కూల్ తూప్రాన్ విద్యార్థులు మహతి కృత్తిక రాజేష్ ఆశీష్ లు సంయుక్తంగా రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైనందున గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో విద్యార్థులను అదనపు కలెక్టర్ నగేష్ అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభావంతులైన విద్యార్థుల వారి అపూర్వ మేధాశక్తి వెలకట్టలేనిది అన్నారుప్రతిభా పాటవాలకు పదును పెట్టి ఆన్లైన్లో ప్రాజెక్టు తయారు చేసి జాతీయస్థాయికి ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. వీరికి 25వేల నగదు పురస్కారం అందజేయబడుతుందన్నారు ఇదే స్ఫూర్తితో మిగతా విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు,సివిల్ సప్లై అధికారులు నిత్యానందం, జగదీశ్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మరియు ఉపాధ్యాయులు రాజేశ్వర్ లు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల అరెస్టుపై మండిపడ్డ తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి: అమానుషంగా వ్యవహరిస్తున్న పోలీసులపై తీవ్ర ఆగ్రహం

.






**పటాన్‌చెరు, జూలై 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ఉద్యమకారులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవితమ్మను, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని టిఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, హైకోర్టు అడ్వకేట్ తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఆయన బొల్లారం పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం మరియు పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన లేవనెత్తిన ప్రధానాంశాలు:నిరసనకారులకు అందని కనీస సదుపాయాలు: నిరసనలో పాల్గొన్న కవితమ్మతో పాటు కార్యకర్తలను పోలీసులు అమానుషంగా వేధించడమే కాకుండా, బొల్లారం పోలీస్ స్టేషన్‌లో వారికి కనీస వైద్య సేవలు కూడా అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.లీగల్ టీమ్‌కు అవమానం: "మేము హైకోర్టు అడ్వకేట్లతో కలిసి ఇక్కడికి వస్తే, కనీసం మమ్మల్ని పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులను, లీగల్ టీమ్‌ను పక్కన పెట్టి, కనీసం కవితమ్మను లోపలికి వెళ్లి చూసేందుకు కూడా అనుమతి ఇవ్వకపోవడం పోలీసుల అహంకారానికి నిదర్శనం" అని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలు: ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిందని, దానిపై నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కూడా కాలరాస్తున్నారని ఆరోపించారు.అధికార యంత్రాంగంపై ప్రశ్నలు:తెలంగాణ సాధనలో ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయాలను విస్మరించి, నిరసన తెలుపుతున్న పార్టీ అధ్యక్షురాలిని ఇలా అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.డిజిపికి డిమాండ్: ఈ ఘటనపై డిజిపి వెంటనే స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అక్రమంగా నిర్బంధించిన వారిని బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.పోలీసుల ఈ అక్రమ, అమానుష చర్యల వల్ల తెలంగాణలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ఇటువంటి చర్యలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

# ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ పోటీలలో పాల్గొనండి

- గీతం విద్యార్థులకు పిలుపు
- జాతీయ స్థాయి పోటీలలో మరోసారి సత్తాచాటాలని సూచన

**పటాన్‌చెరు,జూలై 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక ఆవిష్కరణల కార్యక్రమమైన ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 6.0లో చురుకుగా పాల్గొనాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తన విద్యార్థులు, అధ్యాపకులను కోరింది.అధ్యాపకులను ఉద్దేశించి గీతం వెంచర్ డెవలప్మెంట్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్, ఎంఎస్ఎంఈ ఇంక్యుబేషన్ స్కీమ్ సమన్వయకర్త వికాస్ కుమార్ శ్రీవాస్తవ సూచనలు చేస్తూ, జాతీయ స్థాయి హ్యాకథాన్ కు సమర్పించేందుకు వీలుగా, విద్యార్థుల ఆశాజనకమైన ఆవిష్కరణలు, పరిశోధన ఆలోచనలు, తరగతి గది ప్రాజెక్టులు, ప్రయోగశాల నమూనాలను గుర్తించి, వాటికి మార్గదర్శకత్వం వహించాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 6.0 ఎంపికైన ప్రతి ఆలోచనను ఒక ఫంక్షనల్ ప్రోటోటైప్ గా, ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ గా లేదా వాణిజ్యపరంగా లాభదాయకమైన ఉత్పత్తిగా అభివృద్ధి చేయడానికి 15 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఎంఎస్ఎంఈలు, సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే ఆచరణాత్మక, విస్తరించదగిన, సాంకేతిక ఆధారిత పరిష్కారాలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని వివరించారు.గీతం గతంలో సాధించిన విజయాన్ని ప్రస్తావిస్తూ, ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 5.0 కింద నిధుల కోసం విశ్వవిద్యాలయం నుంచి రెండు ప్రతిపాదనలు ఎంపికయ్యాయని శ్రీవాస్తవ తెలిపారు. కాలిన గాయాలకు పోర్టబుల్ డ్యూయల్-మోడ్ చికిత్సా పరికరమైన ఫ్లెక్సీహీల్ ను అభివృద్ధి చేసినందుకు డాక్టర్ సత్యవ్రత డాష్ కు 10.2 లక్షల రూపాయల ప్రభుత్వ మద్దతు లభించగా, తీరప్రాంత విపత్తుల పర్యవేక్షణ, సుస్థిర మత్స్య పరిశ్రమ కోసం ఏఐ ఆధారిత స్మార్ట్ బాయ్ నెట్ వర్క్ అయిన కోస్ట్-సేఫ్ కోసం చంద్రకాంత మహంతి 11.9 లక్షల రూపాయలు సాధించారన్నారు. ప్రస్తుత ఎడిషన్లో గీతం మరింత గొప్ప విజయాన్ని సాధించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. వినూత్న ఆలోచనలు ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఇంక్యుబేషన్, మెంటరింగ్ మద్దతుతో తమ భావనలను నిధులు పొందే ప్రాజెక్టులుగా మార్చుకోవాలని ఆయన ప్రోత్సహించారు. ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 6.0 కోసం జూలై 5 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని, ఎంఎస్ఎంఈ ఇన్నోవేషన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకుని, తమ ప్రతిపాదనలను సమర్పించేటప్పుడు గీతంను హోస్ట్ ఇన్‌స్టిట్యూట్ గా ఎంచుకోవాలని సూచించారు.ఈ హ్యాకథాన్ పునరుత్పాదక శక్తి, శక్తి సామర్థ్యం, ఆటోమోటివ్ టెక్నాలజీ, ఇండస్ట్రీ 4.0, 5.0, రోబోటిక్స్, ఆటోమేషన్, ఇంకా ఇతర అత్యాధునిక సాంకేతికతల వంటి రంగాలలో ఆలోచనలను ఆహ్వానిస్తు ఒదన్నారు. ప్రతిపాదిత ఆవిష్కరణలు నూతనంగా, విస్తరించదగినవిగా, సామాజికంగా సంబంధితమైనవిగా ఉండాలని, వాణిజ్య సామర్థ్యంతో పనిచేసే నమూనాలుగా అభి వృద్ధి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉండాలని స్పష్టీకరించారు. హ్యాకథాన్ గత సంచికలో సాధించిన అద్భుతమైన పనితీరును కొనసాగిస్తూనే, భారతదేశ ఆవిష్కరణ, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థకు గీతం తన సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు వీలుగా, అర్హులైన విద్యార్థులను, పరిశోధన బృందాలు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించవలసిందిగా అధ్యాపకులను శ్రీవాస్తవ కోరారు.

# సిద్ధార్థ ఎంక్లేవ్ కాలనీలో పార్కు నిర్మాణం చేపట్టండి

- అమీన్‌పూర్ అడిషనల్ కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సిఫార్సు లేఖను కమిషనర్‌కు సమర్పించిన వైనం




**అమీన్‌పూర్, జూలై 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని పటేల్ గూడ పరిధిలోని సిద్ధార్థ ఎంక్లేవ్ కాలనీవాసుల చిరకాల స్వప్నమైన పార్కు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం అమీన్‌పూర్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో అడిషనల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ కి వారు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. అమీన్‌పూర్ రెవెన్యూ మండలం, పటేల్ గూడ గ్రామంలో సర్వే నంబర్లు (88), (90)లలో సుమారు 2,700 చదరపు గజాల ప్రభుత్వ స్థలం నిరుపయోగంగా ఉందని, అక్కడ పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. ఈ స్థలంలో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ మరియు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మిస్తే, సిద్ధార్థ ఎంక్లేవ్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న అనేక కాలనీల ప్రజలకు, పిల్లలకు మరియు వృద్ధులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు.ఈ పార్కు అభివృద్ధికి అవసరమైన సిఫార్సు చేస్తూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారు రాసిన లేఖను కూడా ఈ సందర్భంగా కమిషనర్‌కు అందజేశారు. కాలనీవాసుల విన్నపాన్ని సానుకూలంగా స్వీకరించిన కమిషనర్ మనోహర్, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పార్కు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిద్ధార్థ ఎంక్లేవ్ కాలనీ ప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# అంటు వ్యాధులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి

- వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- జిల్లాలో శానిటేషన్ ఆక్టివిటీ పగడ్బందీగా అమలు కావాలి
- దోమలు పుట్టకుండా , కుట్ట కుండా లార్వాలను నిర్మూలించాలి.
- హైరిస్క్ గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసే దిశగా ముందస్తు ప్రణాళిక
- ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రాణరక్షకమందులన్నింటినీ అందుబాటులో ఉంచాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్







**మెదక్,జులై,2,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**
మాన్సూన్ ముందస్తు పటిష్ట కార్యచరణ రూపొందించాలని,అంటు వ్యాధులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని,మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజారోగ్య పరిరక్షణ మనందరి కర్తవ్యం. వైద్య ఆరోగ్య, పంచాయతీ శాఖ అధికారుల సమన్వయంతోనే సాధ్యపడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ అన్నారు.గురువారం కలెక్టరేట్ ప్రజావాణి హాలు నందు వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పంచాయతీ , అధికారులతో పరిసరాల పరిశుభ్రత వ్యాధుల నిర్మూలనే.ధ్యేయంగాసమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరియు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని వాతావరణం మారినప్పుడల్లా ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తాయి కాబట్టి వైద్య ఆరోగ్యశాఖ తో పాటు లైన్ డిపార్ట్మెంట్స్ అలెర్ట్ గా వుండాలని అన్నారు., ఈ నాలుగు నెలలు మెడికల్ క్యాంప్స్ నిర్వహించాలని, ఫీవర్ సర్వే చేపట్టాలని , సూచించారు. డెంగ్యూ పట్ల ప్రజల్లో ఉన్న భయాలను దూరం చేయాలని , నిరంతరం ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని, తెలిపారు. మురికి కాల్వలు లేకుండా చూడాలని , దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూడాలని , డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు ముఖ్యంగా శానిటేషన్ డ్రైవ్ పర్ఫెక్ట్ గా చేయాలని, ప్రజలకు వ్యాధులు రాకుండా కాపాడాలని, వ్యాధులు వస్తే నిర్ధారణ పరీక్షలు నిర్వహించి తక్షణమే చికిత్స అందించాలని , తెలిపారు. డాక్టర్లు ప్రజలకు అందుబాటులో వుండాలని , ఆహారం, శుభ్రమైన మంచినీరు , వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన , నివారణ మరియు చికిత్సలను ఆలస్యం లేకుండా చేయాలని , వెల్లడించారు. జూలై 13 నాడు నేషనల్ డీ వార్మింగ్ ప్రోగ్రాం ( జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం ) సంధర్భంగా ఆక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, . చెప్పారు.లైన్ డిపార్ట్మెంట్స్ కలిసి ప్రోగ్రాం సక్సెస్ చేయాలని , మాపప్ ప్రోగ్రాం 20 నాడు నిర్వహించాలని .తెలిపారు.అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని , మందులను , వ్యాక్సిన్ లను అందుబాటులో ఉంచాలని చెప్పారు.ప్రజారోగ్య పరిరక్షణకు. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, సమిష్టి కృషితో పటిష్ట ప్రణాళికతో ముందు చూపుతో వ్యవహరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ హితబోధ చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, , జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ , డి.సి.హెచ్.ఎస్. డా. శివ దయాళ్, జిల్లా విద్యా శాఖాధికారి, రాజు, డి.డబ్లు.ఓ, హేమ భార్గవి ,డి.పి.ఓ, యాదయ్య, డి.పి.అర్.ఓ, రామచంద్ర రాజు, డిప్యుటి డి.ఎం.హెచ్.ఓ డా,సృజన , డా.జయమాలిని,ప్రోగ్రాం అధికారులు డా.నవ్య , డా.హరి ప్రసాద్ , డా.జయశ్రీ, నర్సాపుర్, తూప్రాన్ , రామాయణం పేట్ , మెదక్ మునిసిపల్ కమిషనర్లు , పి.హెచ్.సి.మెడికల్ ఆదిసర్లు, ఎం.ఎల్.హెచ్.పి.లు , సూపర్వైజర్లు ఎంపీలు తదితరులు పాల్గొన్నారు .

# కల్వకుర్తిలో మల్లు రవి 'ప్రజా పాలన -- ప్రగతి నివేదిక -- జ్ఞాన చైతన్య' బస్సు యాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎక్స్ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

- కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు
- మాజీ ఎమ్మెల్యే, ఎక్స్ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డికి నాయకుల ఘన స్వాగతం



**(స్పెషల్ కరస్పాండెంట్)కల్వకుర్తి,జులై,2,మెదక్ టుడే న్యూస్**
కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రజా పాలన -- ప్రగతి నివేదిక -- జ్ఞాన చైతన్య" బస్సు యాత్ర ముగింపు కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సన్మానించారు.

ప్రజా పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి చేరవేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందని పిలుపునిచ్చారు.

ప్రజలతో మమేకమైన బస్సు యాత్ర

'ప్రజా పాలన -- ప్రగతి నివేదిక -- జ్ఞాన చైతన్య' బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని, ఇదే ఉత్సాహంతో పార్టీ కార్యకర్తలు పనిచేయాలని సూచించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి కొనసాగిద్దాం

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా అందరూ సమిష్టిగా పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి మల్లు రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అంటే బకాయిలు... అప్పులు... అవినీతికే చిరునామా..!

- ●దొరల పార్టీ కాదు... దొంగల పార్టీ అంటూ వీర్లపల్లి శంకర్ తీవ్ర విమర్శలు
- ●"మీ తండ్రి బ్రోకర్... మీరిద్దరూ జోకర్లు"
- ●"స్కీంల పేరుతో స్కామ్‌లే చేశారు"
- ●"కెసిఆర్ భోజనాలకే రూ.995 కోట్లు ఖర్చు"
- ●"తెలంగాణను రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచింది బీఆర్ఎస్"
- ●'అవినీతికిపాల్పడిన వారికి శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదు



**(స్పెషల్ కరస్పాండెంట్)షాద్‌నగర్,2,మెదక్ టుడే న్యూస్**
పదేళ్ల బీఆర్ఎస్ పాలన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులు, అవినీతి, అక్రమాల అగాధంలోకి నెట్టిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అగ్రనేతలపై ఘాటు విమర్శలు చేశారు.

**"ప్రజల సొమ్మును దోచుకున్నవారికి మాట్లాడే హక్కు లేదు"**
ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక అర్హత లేదన్నారు. ప్రజలు తిరస్కరించినా ఇంకా అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.

**"మీ తండ్రి బ్రోకర్... మీరిద్దరూ జోకర్లు"**
కేటీఆర్, హరీష్ రావులను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే, ఒకప్పుడు బ్రోకర్‌గా ఉన్న మీ తండ్రి, ఇప్పుడు మీరు జోకర్లుగా రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కవిత చేసిన వ్యాఖ్యలే బీఆర్ఎస్ కుటుంబ అవినీతికి నిదర్శనమని పేర్కొన్నారు.

**"కుంభకర్ణుడిలా కెసిఆర్... బకాసురుల్లా కుటుంబం"**
తొమ్మిదిన్నరేళ్లలో కెసిఆర్ భోజనాలకే రూ.995 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ప్రజల సొమ్మును కుంభకర్ణుడిలా కెసిఆర్, బకాసురుల్లా ఆయన కుటుంబ సభ్యులు ఖర్చు చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**"68 వేల కోట్ల నుంచి రూ.8 లక్షల కోట్ల అప్పులు"**
ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలన్నీ కలిపి రూ.68 వేల కోట్ల అప్పులు చేస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కటే రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు.

**"బకాయిల ప్రభుత్వంగా బీఆర్ఎస్ చరిత్ర"**
ఫీజు రీయింబర్స్‌మెంట్, డిస్కంలు, గ్రామ పంచాయతీలు, ఆర్టీసీ, సివిల్ సప్లై, మధ్యాహ్న భోజన పథకం, అభివృద్ధి పనుల కాంట్రాక్టర్లకు చెల్లింపులు సహా ప్రతి శాఖలో బకాయిలే మిగిల్చి వెళ్లారని విమర్శించారు.

**"హామీలు ఇచ్చి... ప్రజలను మోసం చేశారు"**
దళితుడే ముఖ్యమంత్రి, దళితులకు మూడు ఎకరాల భూమి, లక్ష ఎకరాలకు సాగునీరు, కేజీ టు పీజీ విద్య వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు.

**"షాద్‌నగర్‌లో అసంపూర్తి పనులే మిగిల్చారు"**
డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను హడావుడిగా ప్రారంభించినా పూర్తి చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10 కోట్లతో మిగిలిన పనులు పూర్తి చేశామని తెలిపారు.

**"ఎక్కడ చూసినా స్కామ్‌లే"**
కాళేశ్వరం, ఢిల్లీ లిక్కర్ స్కాం, ఫార్ములా-ఈ, దళిత బంధు, రైతుబంధు, గొర్రెల పంపిణీ, ధరణి, రేషన్ బియ్యం, ఇసుక, విద్యుత్ కొనుగోలు, డబుల్ బెడ్‌రూమ్, ఓఆర్ఆర్ టెండర్లు, బతుకమ్మ చీరలు, మిషన్ కాకతీయ, హరితహారం, మార్క్‌ఫెడ్, పత్తి కొనుగోళ్లు... ఇలా ప్రతి పథకాన్ని స్కామ్‌గా మార్చిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని ఆరోపించారు.

**"ధరణితో భూముల దోపిడీ"**
ధరణి పేరుతో కోట్ల రూపాయల విలువైన భూములను ఆక్రమించారని, ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి మద్యం టెండర్ల డబ్బులను కూడా ముందుగానే తీసుకెళ్లారని ఆరోపించారు.

**"దమ్ముంటే ఆధారాలతో మాట్లాడండి"**
కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేసే ముందు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ప్రతి అవినీతిని తాము ఆధారాలతో బయటపెడతామని స్పష్టం చేశారు.

**"శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదని హెచ్చరిక"**
ఇకనైనా బీఆర్ఎస్ అగ్రనేతలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లేకుంటే వారి అవినీతి బండారాలన్నీ ప్రజల ముందుంచుతామని హెచ్చరించారు. అవినీతికి పాల్పడిన వారికి భవిష్యత్తులో "శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదు" అంటూ తీవ్ర వ్యాఖ్యల ం చేశారు. ఈ సమావేశంలో మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, రఘు, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, నల్లమోని శ్రీధర్, కృష్ణ, రమేష్, జంగారి రవి, బాబు నాయక్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# కూల్చివేతలు జరిగిన చోటే మళ్లీ అక్రమ షెడ్లు.. అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటి?










**అమీన్‌పూర్, జూలై 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ఒకవైపు ప్రభుత్వం, హైడ్రా అధికారులు చెరువులు, ప్రభుత్వ భూములు, రోడ్ల ఆక్రమణలను తొలగించేందుకు భారీగా జేసీబీలతో రంగంలోకి దిగుతుంటే.. మరోవైపు అమీన్‌పూర్ పరిధిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. నరేగూడెం చౌరస్తా నుండి కిష్టారెడ్డిపేట వెళ్లే రహదారిలో జరిగిన పరిణామాలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**మళ్ళీ పుట్టుకొస్తున్న అక్రమ కట్టడాలు:**
గత కొద్ది రోజుల క్రితం హైడ్రా అధికారులు, జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ సిబ్బంది సుమారు 20 నుండి 30 జేసీబీల సహాయంతో నరేగూడెం చౌరస్తా నుండి కిష్టారెడ్డిపేట వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న సుమారు 100 నుండి 150 అక్రమ షాపులను నేలమట్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా, రోడ్ల విస్తరణకు ఆటంకం లేకుండా ఈ చర్యలు తీసుకున్నారని స్థానికులు అప్పట్లో హర్షం వ్యక్తం చేశారు. అయితే, ఆ కూల్చివేతలు జరిగిన కొద్ది రోజులకే అదే స్థలాల్లో మళ్లీ యథేచ్ఛగా అక్రమ షెడ్లు వెలుస్తున్నాయి. మెకానిక్ షెడ్లను ఏర్పాటు చేసుకుని, మళ్లీ తమ పనులను కొనసాగిస్తున్నారు.

**అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?**
అక్రమ ఆక్రమణలు మళ్లీ పునరావృతం అవుతున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. "ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరొక న్యాయమా?" అంటూ ఇప్పటికే నష్టపోయిన చిన్న వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ముడుపులు అందిస్తున్నందునే వారు అక్రమ నిర్మాణాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఎవరి అండ చూసుకుని ఈ ఆక్రమణలు మళ్లీ మొదలయ్యాయని స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

**స్పందించాలని కోరుతున్న స్థానికులు:**
మొదటగా పెట్టిన ఒక చిన్న షెడ్డును అధికారులు చూసి చూడనట్లు వదిలేయడంతో, దాన్ని చూసి మరికొందరు కూడా రోడ్లను ఆక్రమించి షెడ్లు వేసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అమీన్‌పూర్ జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసాద్ మరియు డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ స్పందించాలని, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అక్రమంగా నిర్మించిన ఈ షెడ్లను తొలగించి, రోడ్లను ఆక్రమణల నుండి కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఉన్నత అధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకుని, ప్రభుత్వ ఆదేశాలను దిక్కరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటారా? లేదా ఆక్రమణలు ఇలాగే కొనసాగుతాయా? అనేది వేచి చూడాలి.


# అయోధ్య,కాశికి సూపర్ లగ్జరీ బస్సు

**రామగుండం,జూలై 2 :-**
గోదావరిఖని నుండి అయోధ్య, కాశి,గయాకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును జులై 15 బుదవారం మద్యాహ్నం గం॥01:00 కు బయలుదేరే ఈ బస్సు రాంటెక్,ప్రయాగరాజ్, అయోధ్య,కాశి,గయా,బుద్ధ గయా మరియు మైహర్ (శారదాదేవి శక్తిపీఠం) దర్శనం అనంతరం ఏడవ రోజు గోదావరిఖనికి చేరుకుంటుంది. ఈ యాత్రకు చార్జి ఒక్కరికి రూ॥ 7100/- బోజనం మరియు వసతి ఖర్చులు ప్రయాణికులు భరించాలని,మరిన్ని వివరాలకు 7013504982, 7382847596 గల నంబర్లకు ఫోన్ చేయగలరని డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# అయోధ్య,కాశికి సూపర్ లగ్జరీ బస్సు

**రామగుండం,జూలై 2 :-**
గోదావరిఖని నుండి అయోధ్య, కాశి,గయాకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును జులై 15 బుదవారం మద్యాహ్నం గం॥01:00 కు బయలుదేరే ఈ బస్సు రాంటెక్,ప్రయాగరాజ్, అయోధ్య,కాశి ,గయా,బుద్ధ గయా మరియు మైహర్ (శారదాదేవి శక్తిపీఠం) దర్శనం అనంతరం ఏడవ రోజు గోదావరిఖనికి చేరుకుంటుంది. ఈ యాత్రకు చార్జి ఒక్కరికి రూ॥ 7100/- బోజనం మరియు వసతి ఖర్చులు ప్రయాణికులు భరించాలని,మరిన్ని వివరాలకు 7013504982, 7382847596 గల నంబర్లకు ఫోన్ చేయగలరని డిపో మేనేజర్ సిహెచ్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు.

# సమర భేరీ సభను విజయవంతం చేయాలని ఉద్యమ కారులకు ఆహ్వానం



**రాజపేట జూలై: 02, :**
ఈ నెల 5వ తేదీ భువనగిరిలో జరిగే తెలంగాణ రాజ్యాధికార పార్టీ సమరభేరి కార్యక్రమానికి రాజాపేట మండల తెలంగాణ ఉద్యమకారులను ఆహ్వానిస్తూ గురువారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి చంద్రశేఖర్, పాకాల నరసింహులు రంగారెడ్డి జిల్లా యూత్ ప్రెసిడెంట్ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో రాజాపేట తెలంగాణ ఉద్యమకారుల మాజీ అధ్యక్షుడు మారోజు కుమారస్వామి మాజీ ఉపాధ్యక్షులు పెంట సత్యనారాయణ బెడిదే నర్సింహులు రాగీర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల కు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ సమర భేరీ ఈ విషయం దృష్టికి రానుందని, కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమ కారులకు గుర్తింపు కార్డులు హెల్త్ కార్డులు 250 గజాల జాగాను 25 వేల రూపాయల పెన్షన్ను ఇచ్చే విధంగా భువనగిరిలో జరిగే సమర భేరీ కార్యక్రమంలో ఉద్యోగం కారుల ప్రస్తావన మాట్లాడాలని కోరుతూ బొడ్డుపల్లి చంద్రశేఖర్ కు రాజాపేట తెలంగాణ ఉద్యమకారుల మాజీ అధ్యక్షుడు రోజు కుమారస్వామి మాజీ ఉపాధ్యక్షుడు పెంట సత్యనారాయణ లు వినతి పత్రం అందజేశారు.

# యాదగిరిగుట్ట ఇన్‌చార్జ్ ఏడీఏగా పద్మజ బాధ్యతల స్వీకరణ



**రాజాపేట, జూలై 2):** రాజాపేట మండల వ్యవసాయ అధికారిణి గా విధులు నిర్వహిస్తున్న పద్మజకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె కు యాదగిరిగుట్ట వ్యవసాయ శాఖ ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకురాలిగా (ఏడీఏ) బాధ్యతలు అప్పగించారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఆమె యాదగిరిగుట్ట కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఏడీఏగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని పద్మజ తెలిపారు. రాజాపేట వ్యవసాయ అధికారిణిగా తన బాధ్యతలను కొనసాగిస్తూనే, యాదగిరిగుట్ట ఇన్‌చార్జ్ ఏడీఏగా కూడా విధులు నిర్వహించనున్నారు. పద్మజ నియామకంపై వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

# పీడీఎస్ బియ్యం స్వాధీనం..

**- యువకుడిపై కేసు నమోదు..**

**రాజపేట, జూలై 2(**
రాజపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 40 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్ ) బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, జూలై 1న సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు రాజపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ పి. ప్రభాకర్ నాయుడు ఉన్నతాధికారుల అనుమతితో సిబ్బందితో కలిసి రాజపేట మండలం పుట్టగూడెం గ్రామంలోని ఓ ఇంటిపై దాడి నిర్వహించారు. ఇంట్లో తనిఖీలు చేపట్టగా 80 పాలిథిన్ సంచుల్లో నిల్వ ఉంచిన సుమారు 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించారు. బియ్యం నిల్వపై సరైన ఆధారాలు చూపించలేకపోవడంతో నిందితుడు భూక్య నితిన్ ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో గజ్వేల్‌కు శ్రీనివాస్ సూచనల మేరకు యాదగిరిగుట్ట మండలంలోని రేషన్ కార్డు దారుల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, కమిషన్ ప్రాతిపదికన అతనికి విక్రయిస్తున్నట్లు నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. గత నెల రోజులుగా కొనుగోలు చేసిన బియ్యాన్ని తన ఇంట్లో నిల్వ ఉంచినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. అనంతరం ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి, 80 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రాజపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..